క్లుప్తంగా

నేడు జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

మండపేట: జవహర్ నవోదయ విద్యాలయలో ఆరో తరగతిలో చేరేందుకు శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు మండల విద్యాశాఖాధికారి నాయుడు రామచంద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థుల కోసం పట్టణంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పాటి మీద ఉన్న గౌతమి మున్సిపల్ పాఠశాల, పోలీస్ స్టేషన్ వీధిలోని పాలడుగు సత్యవతి చంద్రమౌళి బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు ఏడిద రోడ్డులోని ఎస్‌వీఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు గంట సమయం ముందుగానే చేరుకోవాలని ఎంఈవో రామచంద్రరావు సూచించారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

రామచంద్రపురం: మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నేడు నిర్వహించనున్నట్లు మంత్రి పీఆర్‌ఓ సత్యంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు మంత్రి సుభాష్ చేతుల మీదుగా రక్తదాన శిభిరం ప్రారంభించనున్నట్లు తెలిపారు. రక్తదాతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు పసలపూడిలో త్యాగరాజ ఆరాధన

రాయవరం: మండలంలోని పసలపూడిలో శనివారం సద్గురు త్యాగరాజస్వామి తృతీయ ఆరాధన మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని త్యాగరాజ ఆరాధన ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 7.30 గంటలకు స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. కాకినాడకు చెందిన ఎస్‌ఏ రహమాన్ బృందంతో గాత్ర కచేరి, మధ్యాహ్నం 1.30 గంటలకు నాదస్వర కచేరి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. నాదస్వర కచేరిలో శ్రీకాకుళం నుంచి నాదస్వర విద్వాంసులు కె.గణేష్, టి.సంతోష్, శ్రీవాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం డోలు నిలయ విద్వాంసులు రామవరపు సుధాకర్, తిరుమల తిరుపతి దేవస్థాన నిలయ విద్వాంసులు ఎస్.శ్రీను పాల్గొంటారని తెలిపారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11 పరిధిలోని ఇండస్ట్రియల్ ఫీడర్, మండల హెడ్ క్వార్టర్ కపిలేశ్వరపురం ఫీడర్ పరిధిలోని గ్రామాల వెంబడి ఉన్న విద్యుత్ లైన్లకు శుక్రవారం మరమ్మతులు చేశారు. రామచంద్రపురం డివిజనల్ ఈఈ కె.రత్నాలరావు ఆదేశాల మేరకు ఆయా ఫీడర్ల పరిధిలోని కపిలేశ్వరపురం, అంగర, టేకి, మాచర, మాచరమట్లలు, శ్రీరామపురం, వెదురుమూడి, పడమర ఖండ్రిక, నల్లూరు, కాలేరు, సుభద్రాపురం గ్రామాల్లో సుమారు ఆరు గంటలు పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమం

కపిలేశ్వరపురం: రాష్ట్రంలోని శ్రామికవర్గం సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఉద్యమించనున్నట్టు సీఐటీయూ జిల్లా నాయకురాలు కె.కృష్ణవేణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్‌గా ఉన్న పాత పెన్షన్ విధానం పునరుద్ధరణను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు చిరుద్యోగుల వేతనాలను పెంచాలన్నారు. కూటమి ప్రభుత్వం శ్రామికవర్గానికి అనేక హామీలిచ్చిందన్నారు. ఏడు నెలలు పాలనను పూర్తి కావస్తున్నా హామీల ఊసెత్తడం లేదని విమర్శించారు.

పుట్టా లక్ష్మీకాంతం మృతికి సంతాపం

కపిలేశ్వరపురం: మండల సాగు సలహా మండలి మాజీ చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి మాతృమూర్తి లక్ష్మీకాంతం (99) ఇటీవల ఒడిశాలో వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆమె మృతికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణమూర్తిని ఎమ్మెల్సీ తోట, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి ఫోన్‌లో పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

నిరుద్యోగ యువతకు పీఎం ఇంటర్న్‌షిప్

రాజోలు: నిరుద్యోగ యువత ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు శుక్రవారం తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైన వారికి నెలకు రూ.5 వేలు చొప్పున ఏడాది పాటు రూ.60 వేలు స్టైపెండ్ చెల్లిస్తారన్నారు. దీంతో పాటు వ్యక్తిగత బీమా సౌకర్యం కల్పిస్తారని బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఎస్ఎస్‌సీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్సీ, బి.ఫార్మసీ, బీబీఏ డిగ్రీ ఉత్తీర్ణత అయిన వారు అర్హులన్నారు. వివరాలకు సెల్ 8247645389 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

దాళ్వా సాగులో కలుపు బెడద

- సకాలంలో నివారించకుంటే తీవ్ర నష్టం
- కలుపు నిర్మూలనకు వ్యవసాయాధికారుల సూచనలు



కాజులూరులో వెదజల్లిన వరి పొలంలో కలుపు నివారణకు రసాయన మందులు పిచికారీ చేస్తున్న రైతులు



కాజులూరులో కలుపు తొలగించిన వెదజల్లిన వరి పొలం

కాజులూరు: ఈ ఏడాది తొలకరి పంట చివరి దశలో భారీ వర్షాలు కురిసి మాసూళ్లు ఆలస్యమవడంతో దాళ్వా పంట దమ్ములకు, నారుమడులు, నాట్లు వేసుకునేందుకు తీవ్రజాప్యం జరిగింది. దానికి తోడు ఈ ఏడాది గోదావరి డెల్టా కాలువలకు మార్చి నెలాఖరు నాటికి సాగునీరు సరఫరా నిలుపుదల చేస్తామని నీటి పారుదలశాఖ అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో తక్కువ కాలంలో పంట దిగుబడికి వచ్చేలా రైతులు సాగు చేపట్టాలని అందుకు వెదజల్లు విధానం శ్రేష్టమైందని వ్యవసాయాధికారులు సూచించడంతో రైతులు ఆ దిశగా ప్రయత్నం చేపట్టారు. నియోజకవర్గంలో 52 వేల ఎకరాల్లో రైతులు ఈ ఏడాది దాళ్వాసాకు చేపట్టగా కె.గంగవరం మండల గ్రామాల్లో సుమారు 60 శాతం, రామచంద్రపురం మండల గ్రామాల్లో 70 శాతం, కాజులూరు మండల గ్రామాల్లో 85 శాతం రైతులు వెదజల్లు విధానంనే అవలంబిస్తున్నారు. అయితే సాదారణ పద్ధతిలో కంటే వెదజల్లు వరి పొలాల్లో కలుపు తీవ్రత ఎక్కువగా ఉటుంది. వరి మొక్కతో పాటు కలుపుమొక్క సమాంతరంగా పెరుగుతుంది. ఈ కలుపు మొక్కలను సకాలంలో నివారించకుంటే అవి ఎరువులను, భూమిలోని సహజ పోషకాలను ఉపయోగించుకుని క్రమేపి వరి మొక్కలను అధిగమించి పెరుగుతాయి. నియోజకవర్గంలో వెదజల్లు పొలాల్లో కలుపు తీవ్రత ఊహించిన దానికంటే ఎక్కువగానే ఉందని రైతులు చెబుతున్నారు. కొన్ని రకాల కలుపు మొక్కలను నివారించడం కష్టతరంగా ఉందంటున్నారు. తెలిసీ తెలియని రసాయన మందులు వాడితే కలుపు మొక్కతో పాటు వరిమొక్క చనిపోతుందని రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వెదజల్లు చల్లిన రైతులు కలుపు నివారణకు రసాయన మందులను నిర్ణయించిన మోతాదులో సకాలంలో వాడాలని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ చెబుతున్నారు.

కలుపు నివారణకు సూచనలు

వెదజల్లిన పొలాల్లో వరి మొక్క బొడ్డు మొలవక ముందే కలుపు నివారించుకోవడం సులభతరమని ఏవో చెప్పారు. విత్తనాలు చల్లిన మూడు రోజుల్లోపు పొలంలో నీరు తీసేసి సాతి 120 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. మూడు నుంచి ఐదు రోజుల మధ్యలో స్టాప్‌స్టార్ 35 గ్రాముల మందును అరలీటరు నీటిలో కలిపి ఆ మందు ద్రావణాన్ని 20 కేజీల గోదావరి ఇసుకతో కలిపి ఎకరం పంటపై బురద పదునుపై చల్లుకోవాలన్నారు. 15 నుంచి 20 రోజులకు కలుపు ఇంకా ఉన్నట్లయితే నామినీ గోల్డ్ మందును 100 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. 15 రోజులు తర్వాత పొలంలో వుడా, జొడల గడ్డి వంటి వెడల్పాటి ఆకులు కలిగిన కలుపు మొక్కలు కనిపిస్తే 2,4-డి సోడియం సాల్ట్ 500 గ్రాములు, 200 లీటర్ల నీటికి కలిపి పొలంలో పిచికారీ చేయాలన్నారు. కలుపు మందులు పిచికారీ చేసేటప్పుడు పొలంలో పలుచటి నీటిపొర మాత్రమే ఉండాలన్నారు. పొలంలో నీరు నిలబడితే మొక్కలు చనిపోతాయన్నారు. వెదచల్లిన పొలాల్లో కలుపును సమర్థవంతంగా నివారించి తెగుళ్లను అధిగమించగలిగితే నాట్లు వేసిన పొలం కంటే ఎకరాకు ఐదు నుంచి పది బస్తాలు ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు.

సమస్యాత్మకంగా మారింది



వర్షాల కారణంగా దాళ్వా సాగుకు తీవ్ర జాప్యం జరిగింది. దీంతో తక్కువ రోజుల్లో పంట దిగుబడికి వచ్చేలా సాగు చేపట్టాలన్న అధికారుల సూచనల మేరకూ వెదచల్లిక విధానానికి ప్రాధాన్యతనిచ్చాం. అయితే వెదచల్లిన పొలాల్లో కలుపు తీవ్రత సమస్యాత్మకంగా మారింది.

– మాత నూకరావు, రైతు దుగ్గుదుర్రు

అధికంగా ఉంది



వెదచల్లిన పొలాల్లో కలుపు తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. కొన్ని రకాల కలుపుమొక్కలు రసాయన మందులకు చవాటంలేదు. వాటిని సకాలంలో తొలగించకుంటే దట్టంగా పెరిగి పొలంలో కలుపుతీతకు కూలీల సంఖ్య అధికమౌతుంది.

– మట్టా సత్యనారాయణ, రైతు, గొల్లపాలెం

వైఎస్సార్ సీపీ నేత శ్రీరామారెడ్డి మృతి



డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి

కాజులూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గొల్లపాలెం పీఏసీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి (55) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. శ్రీరామారెడ్డి తన భార్య కాకినాడ జిల్లా 3వ అడిషనల్ జడ్జి కోర్టు ఏపీపీ సత్తి గంగాదేవితో కలసి గత ఐదు రోజుల క్రితం తీర్థయాత్రలకు వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి సొమ్మసిల్లి పడిపోయారు. స్థానిక భక్తులు గమనించి సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. 24 ఏళ్ల క్రితం గొల్లపాలెంలో శ్రీరామ్‌నర్సింగ్‌హోమ్ స్థాపించి కరప, కాజులూరు మండలాల్లో సుమారు 20 గ్రామాల ప్రజలకు సొకగా వైద్య సేవలందిస్తూ పేదల డాక్టర్‌గా గుర్తింపు సాధించారు. ఆయన మరణవార్త స్థానిక గ్రామాల ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రామచంద్రాపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ తదితరులు ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. శుక్రవారం అర్ధరాత్రి శ్రీరామారెడ్డి భౌతికకాయం స్వగ్రామం చేరుకుంది. బంధుమిత్రులు, అభిమానుల ఆధ్వర్యంలో శనివారం శవయాత్ర చేపట్టి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఇమామ్ హజరత్ అలీ జయంతి



ద్రాక్షారామ పెద్ద మసీదు వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న మత గురువు మీర్జా అస్కరి హుస్సేన్ తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ షియా జామియా జాఫరీ (పెద్ద) మసీదు వద్ద శుక్రవారం మహ్మద్ ప్రవక్త అల్లుడు ఇమామ్ హజరత్ అలీ జయంతిని మత గురువు మీర్జా అస్కరి హుస్సేన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ ఘనీ, సయ్యద్ ఫాజిల్, అక్బర్, మెహింది, రెహాన్, అలీ రజా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీదేవి జాతర

- అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



వెదురుపాకలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రాయవరం: మండలంలోని వెదురుపాకలో గౌరీదేవి జాతర గురువారం రాత్రి కన్నులపండువగా జరిగింది. తూర్పుకాపుల విద్యా, విజ్ఞాన అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రెండేళ్లకు ఒకసారి..

గౌరీదేవి ఉత్సవాన్ని గ్రామంలో అనాదిగా సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. రెండేళ్లకు ఒకసారి విజయదశమి రోజున వరిదుబ్బును లక్ష్మీదేవిగా భావిస్తూ గౌరీదేవి ఆలయానికి తీసుకుని వస్తారు. అనంతరం వచ్చే పౌర్ణమి రోజున ప్రత్యేకంగా తయారు చేసిన నంది వాహనదారులైన శివుడు, గౌరీదేవి విగ్రహాన్ని గౌరీదేవి ఆలయానికి తీసుకు వచ్చిన అనంతరం అట్లతద్ది రోజున గౌరీదేవి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు శిరస్సున ధరించిన ఉత్సవ మూర్తులను ఇంటింటా ఊరేగించి ప్రత్యేకంగా తయారు చేసిన పాన్పును భక్తుల ఇంటి ముందు ఉంచుతారు. ఆ పాన్పుపై ఉత్సవ మూర్తులను ఉంచి పూజలు చేస్తారు. భక్తులు తమ శక్తి కొలది గౌరీదేవికి చీరలు, రవికెలు, బంగారు, వెండి ఆభరణాలు, గారెలు, బూరెల దండలు మొక్కులుగా చెల్లిస్తారు.

అత్తారింటికి ఘనంగా సాగనంపిన భక్తులు

గత రెండు నెలలుగా ఉత్సవమూర్తులకు, వరిదుబ్బుకు అఖండజ్యోతితో పూజాధికాలు చేశారు. గౌరీదేవిని అత్తవారింటికి సాగనంపడంలో భాగంగా గౌరీదేవి విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేశారు. జాతరలో వెదురుపాక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. బ్యాండ్ మేళాలు, గరగ నృత్యాలు, శక్తివేషాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



జాతరలో భక్తులను ఆకట్టుకున్న శక్తివేషాలు

యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



వెల్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ, వీఏఏ

రామచంద్రపురం రూరల్: మండలంలోని రైతులంతా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను తమ ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేయించుకుని సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ సూచించారు. మండలంలోని వెల్ల గ్రామంలో వరి పంట పొలాలలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో వరి పంట వెదజల్లడం దాదాపు పూర్తయ్యిందన్నారు. రైతులందరూ ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను ఉపయోగించడం ద్వారా పంట పొలాల్లో పురుగులు, తెగుళ్ల ఫొటోలు అప్‌లోడ్ చేయడం ద్వారా ఆయా సమస్యలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు నేరుగా రైతులతో మాట్లాడి తగిన సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ పి.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.



బాధితుడికి నగదు, సెల్‌ఫోన్ అందజేత



ప్రమాద సమయంలో పోగొట్టుకున్న సొమ్మును బాధితునికి అప్పగిస్తున్న 108 సిబ్బంది

మండపేట: రోడ్డు మీద రూపాయి పడితే నాదేనని బుకాయించి జేబులో వేసుకుని పోయే రోజులివి. అలాంటిది రాత్రి వేళల్లో యాక్సిడెంట్ జరిగితే గాయాల పాలైన వారిని ఆసుపత్రికి చేర్చడమే కాకుండా చిందర వందరగా పడివున్న వస్తువులను భద్రపరచి బాధితులకు అప్పగించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు 108 సిబ్బంది. వివరాల్లోకి వెళితే... గుమ్మిలేరు రోడ్డులోని టోల్‌గేట్ వద్ద గురువారం రాత్రి 10 గంటల సమయంలో బైక్ ప్రమాదం జరిగింది. అనపర్తి గ్రామానికి చెందిన కె.వీరవెంకటరెడ్డి డివైడర్‌ను ఢీకొట్టి కింద పడిపోయారు. తీవ్ర గాయాలపాలైన అతడిని చూసి స్థానికులు 108కి సమాచారమిచ్చారు. అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ 108లో పనిచేస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ రాజు, పైలట్ దుర్గాప్రసాద్ హుటాహుటిన 108 వాహనంతో అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. ప్రమాద స్థలంలో బాధితుడికి సంబంధించిన రూ.17500, సెల్‌ఫోన్ కింద పడిపోవడంతో వాటిని జాగ్రత్తగా భద్రపరచి బాధితుడి చేతికి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. 108 సిబ్బందిని సూపర్‌వైజర్ అజయ్, జిల్లా మేనేజర్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలే కారణం



రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాజేంద్రప్రసాద్

రామచంద్రపురం రూరల్: రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయని రామచంద్రపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాజేంద్రప్రసాద్ అన్నారు. రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన రహదారి భద్రతా మాసోత్సవ ప్రారంభ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏకాగ్రత ఉండాలని, డ్యూటీకి, డ్యూటీకి మధ్య తగినంత విశ్రాంతి ఉండాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయకూడదని, రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలుపుతూ అవగాహన కల్పించారు. డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జీరో యాక్సిడెంట్స్ లక్ష్యంగా డ్రైవర్లు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, యూనియన్‌ల నాయకులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మండపేటలో 40 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు



అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలసిన పూర్వ విద్యార్థులు

మండపేట: స్థానిక ఏడిద రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1984–85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 40 ఏళ్ల తరువాత స్థానిక సంగీత వెంకటరెడ్డి నగర్‌లోని జొన్నల శేషాయయ్య అబ్బులు కాపు కల్యాణ మండపంలో కలుసుకున్నారు. చదువు అనంతరం దేశ, విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా పూర్వ విద్యార్థులు శెట్టి నాగేశ్వరరావు, చింతల శ్రీనివాస్, ఎండీ అతావుర్ రెహ్మాన్(అల్తాఫ్), యేలేటి శ్రీనివాస్, వాడ్రేవు శ్రీనివాస్, కర్రి వెంకటరమణ కృషితో మళ్లీ కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. వచ్చే ఏడాది నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని మిత్రులంతా నిర్ణయం తీసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గ్రంధి నమశ్శివాయ, అవసరాల ధర్మరాజు, సూరంపూడి గనిరాజు, ఇపకోళ్ల గణేష్ చౌదరి, దూలం నాగేశ్వరరావు, సుంకర బాలాజీ, అంగర శ్రీనివాస్, షాస్తే హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అంగరలో ఆత్మీయ కలయిక

కపిలేశ్వరపురం: అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదాలను తీసుకున్నారు. చదువుకున్న పాఠశాల ఆవరణలో కుటుంబ సమేతంగా కలియతిరుగుతూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. చిన్ననాటి స్నేహితుల ఇళ్లకు వెళ్ళి కుటుంబ సభ్యులను పలకరించారు. పూర్వ విద్యార్థులంతా గ్రూపు ఫొటో దిగి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. వారితో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థి మంగపతి జానిబాబు అకాల మరణాన్ని చింతిస్తూ సంతాపం వ్యక్తం చేశారు. అతని కుటుంబానికి రూ.45 వేలు ఆర్థిక సాయం అందించారు.

